
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 5 అక్టోబరు 2025



కల్తీ మద్యం తయారు చేసే అత్యాధునిక మిషన్

ఆ డైరీలో ఏముందో?

● ఎక్సైజ్ అధికారుల చేతికి కీలక డైరీ

(రాయచోటి -ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఓ డైరీ సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు... శుక్రవారం నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడులు జరిపిన ఎక్సైజ్ అధికారుల చేతికి ఒక డైరీ దొరికింది. ఈ డైరీలో నకిలీ మద్యం కొనుగోలు చేసిన బెల్ట్‌షాపుల నిర్వాహకుల పేర్లు ఉన్నాయి. సుమారు 78 మంది పేర్లు ఉన్నట్లు సమాచారం. వీరిలో ముఖ్యులు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. డైరీలో పేర్లున్న వాళ్ల ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా జరిపిన లావాదేవీలపై ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బి.కొత్తకోటకు చెందిన మద్యం దుకాణ నిర్వాహకుడు, కురబలకోట మండలంలో మద్యం దుకాణం నిర్వహిస్తున్న ఓ మాజీ ప్రజా ప్రతినిధి పేర్లు ఈ డైరీలో ఉన్నట్లు సమాచారం.

ఎక్సైజ్ అధికారులకు తెలిసే..

ముంబై-చెన్నై జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న పాత రోడ్డులో కల్తీ మద్యం తయారీ జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులకు తెలియకపోవడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో నడిచిన పాత డాబాను బాడుగకు తీసుకుని దందా కొనసాగించారు. ఇక్కడ కల్తీ మద్యం తయారు చేసి తంబళ్లపల్లె నియోజకవర్గంతో పాటు శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలలోని పలు గ్రామాలకు, విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.



రాజేశ్ (ఫైల్), కట్టా సురేంద్రనాయుడు (ఫైల్)

తగ్గిన రూ.99 బాటిళ్ల అమ్మకాలు

సాధారణంగా మద్యం దుకాణాల్లో రూ.99 బాటిళ్లకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. అయితే మదనపల్లె మద్యం డిపో నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మూడు మద్యం దుకాణాలు జూన్ నుంచి సెప్టెంబరు వరకు రూ.99 బాటిళ్ల కొనుగోలు క్రమక్రమంగా తగ్గించాయి. దీనిని బట్టి సుమారు నాలుగైదు నెలలుగా తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలలో నకిలీ మద్యం రూ.99 బాటిళ్ల అమ్మకాలు పెరిగినట్లు తెలుస్తోంది.

పట్టించిన వాహనం

ములకలచెరువు నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బెల్ట్‌షాపులకు నకిలీ మద్యం సరఫరా చేస్తున్న వ్యానే గుట్టురట్టు అయ్యేందుకు ఉపయోగపడింది. ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో మూడు రోజుల పాటు ఇక్కడ నిఘా వేసి కల్తీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని వెంబడించారు. ములకలచెరువులోని పాత డాబా దగ్గరకు వస్తుందన్న విషయం గుర్తించి దాడులు చేశారు. కల్తీ మద్యం తీసుకెళ్తున్న వ్యానును అనుమానం వచ్చి ఎవరైనా నిలిపి అడిగితే పాలు తీసుకెళుతున్నట్లు బుకాయించేవారు. పాల రవాణా మాటున కల్తీ మద్యం సరఫరా చేశారు.



కల్తీ మద్యం తయారు చేసిన పాత డాబా

ఇక్కడ తయారైన కల్తీ బ్రాండ్‌లు ఇవే

ములకలచెరువు కేంద్రంగా బెంగళూరు బ్రాందీ, ఓల్డ్ అడ్మిరల్, కేరళ మాల్టెడ్ విస్కీలు ఉన్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా అచ్చు అసలు మద్యం బాటిళ్ల లాగే లేబుళ్లు, బాటిల్ మీద స్కాన్ చేసే స్టిక్కర్లను అంటిస్తున్నారు. ములకలచెరువులో భారీగా పట్టుబడ్డ నకిలీ మద్యం బాటిళ్ల శాంపుల్స్‌ను చిత్తూరు ల్యాబ్‌కు పంపారు.

ఎవరీ జనార్దన్‌రావు?



ములకలచెరువు నకిలీ మద్యం తయారీలో సూత్రధారి, ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు అలియాస్ జానీ విజయవాడకు చెందిన వ్యక్తి. ఇతనికి తంబళ్లపల్లెకు చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నేత, అతని బావమరిదితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వీరు ముగ్గురు కలిసి విదేశాలలో లిక్కర్ బిజినెస్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల్లో ఉన్న మద్యం దుకాణాలు జనార్దన్‌రావు కనుసన్నల్లో నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈయనకు విజయవాడ పరిసరాల్లో ఒక బార్ ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. శనివారం సాయంత్రం విజయవాడలో జనార్దన్‌రావు సోదరుడిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నకిలీ మద్యం తయారీలో 10 మంది అరెస్టు

● ఏ1గా జనార్దన్‌రావు, ఏ5గా రాజేశ్

● విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ జయరాజు

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఎక్సైజ్ ఉన్నతాధికారులు మొత్తం 10 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డికి సన్నితుడైన జనార్దన్‌రావును ఏ1గా, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్‌ను ఏ5గా చేర్చారు. ఈ దాడుల్లో 20,208 కల్తీ మద్యం బాటిళ్లు, 1470 లీటర్ల తయారు చేసిన కల్తీ మద్యం, 1050 లీటర్ల స్పిరిట్‌ను, బెల్ట్‌షాపులకు సరఫరా చేసే లగేజి వాహనంతో పాటు రెండు ద్విచక్రవాహనాలు, కల్తీ మద్యం తయారు చేసే అత్యాధునిక పరికరాలను సీజ్ చేసినట్లు కడప ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ కేసులో ఏ2గా కట్టా రాజు, ఏ3, ఏ4లుగా విశాఖపట్నంకు చెందిన సయ్యద్‌హాజీ, వాహన డ్రైవర్ బాలరాజు, ఏ5గా ములకలచెరువుకు చెందిన రాజేశ్, ఏ6, ఏ7, ఏ8, ఏ9గా తమిళనాడుకు చెందిన మణిమారన్, ఆనందన్, సూర్య, సురేశ్ ఏ10, ఏ11గా ఒడిషా రాష్ట్రానికి చెందిన మిథున్, ఆనంద్ దాస్, ఏ12గా తెనాలికి చెందిన కొడాలి శ్రీనివాసరావు, ఏ13గా పీటీఎం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు, ఏ14గా పీటీఎం మండలం రంగసముద్రంకు చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకుడు నాగరాజు ఉన్నారు ఇందులో జనార్దన్ రావు, కట్టా రాజు, రాజేశ్, కొడాలి శ్రీనివాసులు మినహా 10 మందిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు.



వివరాలు వెల్లడిస్తున్న కడప ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు

ఆంధ్ర వైన్స్ మద్యం దుకాణం సీజ్

పెద్దతిప్పసముద్రం మండలం చెన్నరాయనిపల్లె సమీపంలో ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దులో ఉన్న ఆంధ్ర వైన్స్‌ను ఎక్సైజ్ ఉన్నతాధికారులు సీజ్ చేశారు. మద్యం దుకాణం యజమాని కట్టా సురేంద్రనాయడు ఇంట్లో కల్తీ మద్యం దొరకడంతో ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ విషయాన్ని కడప ఎక్సైజ్‌శాఖ డిప్యూటి కమిషనర్ జయరాజు విలేకరుల సమావేశంలో తెలిపారు.

వీరభద్రుడి హుండీ ఆదాయం రూ.22.99 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శనివారం హుండీల్లోని కానుకలను దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ పర్యవేక్షణలో లెక్కించారు. జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు 100 రోజులకు వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ.16,83,610, భద్రకాళీ అమ్మవారి హుండీ ద్వారా రూ.2,88,310, విఘ్నేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.83,160, అఘోర లింగేశ్వరస్వామి ఆలయ హుండీ రూ.69,750, సుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవస్వామి, నవగ్రహ మండపం హుండీ రూ.48,470, అన్నదానం హుండీ ఆదాయం రూ.1,26,130 కలిపి మొత్తం రూ.22,99,430 ఆదాయం వచ్చింది. ఆ మొత్తాన్ని రాయచోటి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు. ఈ మొత్తంతో పాటు 17.100 గ్రాముల బంగారం, 2.200 కేజీల వెండి వచ్చినట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగి చేతివాటం

● పెన్షన్ సొమ్ము రూ.2.56 లక్షలు స్వాహా

రామసముద్రం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ డబ్బును కాజేశడు. ఎంపీడీవో లతీఫ్‌ఖాన్ వివరాల మేరకు... ఆర్.నడింపల్లె సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఎ.గిరికి ఒకటో తేదీ పెన్షన్ల పంపిణీ కోసం రూ.2.56 లక్షలు అప్పగించారు. అయితే 1, 2 తేదీల వరకు లబ్ధిదారులకు పెన్షన్‌లు పంపిణీ చేయలేదు. ఈ విషయమై లబ్ధిదారులు శనివారం మండల కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఈ విషయమై ఎంపీడీవో ఆరా తీయగా బెట్టింగ్ ఆడి డబ్బును పోగొట్టుకున్నానని తెలిపాడని, ఉన్నతాధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఇతను పీటీఎం మండలంలో పనిచేస్తున్నప్పుడు కూడా పెన్షన్ డబ్బు దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది.

శ్రీకాళహస్తీశ్వర ఆలయ బోర్డు సభ్యురాలిగా సావిత్రి



సుండుపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర ఆలయ పాలక మండలి సభ్యులుగా తెలుగుదేశం పార్టీ సుండుపల్లె మండల అధ్యక్షుడు కర్నే రెడ్డెప్ప సతీమణి కర్నే సావిత్రిని ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుండుపల్లె మండలం ముడుంపాడు గ్రామ పంచాయతీ గోపాలకృష్ణాపురానికి చెందిన రెడ్డెప్ప ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. 1985 నుంచి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి దోహదపడుతున్నారు. ఆయన పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి ఆయన సతీమణిని శ్రీకాళహస్తీశ్వర బోర్డు సభ్యురాలిగా ప్రభుత్వం నియమించింది.

పీలేరులో కుండపోత



చెరువును తలపిస్తున్న పీలేరు బస్టాండు, ప్లాట్‌ఫాంలపైకి చేరిన వర్షపు నీరు

● 98.2 మిల్లీమీటర్ల వర్షం

● జలమయమైన ఆర్టీసీ బస్టాండు

పీలేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పీలేరులో శనివారం గతంలో రికార్డు స్థాయిలో 98.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎటువంటి ఈదురుగాలులు లేకుండా శనివారం వేకువజాము 5 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకు కుండపోతలా కురిసిన వర్షానికి పీలేరు ఆర్టీసీ బస్టాండుతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డు, సంత రోడ్డు జలమయమయ్యాయి.

పీలేరు పరిసర ప్రాంతాలతో పాటు ఎగువన ఉన్న చిత్తూరు జిల్లా సోమల, సదుం మండలాల్లో కురిసిన వర్షాలకు పింఛా నది శనివారం ఉదయం నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. అటు వర్షం, ఇటు పింఛా నది ప్రవాహ ఉధృతి కారణంగా మండలంలోని వాగులు, వంకలు నిండుకుండలను తలపిస్తున్నాయి. పీలేరు ఆర్టీసీ బస్టాండు పూర్తిగా నీటమునగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండుకు ఆనుకుని సంత గేటు వీధి, ఎల్‌బీఎస్ రోడ్డులలో మురుగునీటి కాలువలు పొంగిపొర్లడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో అటు పాదచారులు, ఇటు వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. పీలేరు పట్టణంలోని రైల్వే గేటు వీధి, పాతకోట వీధి, చిన్న టెక్కా, మోడల్ కాలనీ ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పీలేరు-మదనపల్లె మార్గంలోని వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లె వద్ద ఉన్న కొత్తచెరువుకు గండి పడడంతో నీరు చెరువుకు ఆనుకుని ఉన్న పంట పొలాల్లోకి ప్రవహించింది. దీంతో ఆ ప్రాంతంలోని టమోటా, పచ్చిమిరప పంటలకు నష్టం వాటిల్లింది.

పోలీసు, రెవెన్యూ పహారా

పింఛా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యగా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, పీలేరు తహసీల్దారు శివకుమార్ మండలంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో తమ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు. గతంలో ఇద్దరి మృతికి కారణమైన దొడ్డిపల్లె పంచాయతీ నూనేవాండ్లపల్లె వద్ద పింఛా నది బ్రిడ్జిపై పోలీసులు, రెవెన్యూ సిబ్బంది శనివారం ఉదయం నుంచి రాకపోకలు సాగకుండా కట్టడి చేశారు. మదనపల్లె మార్గంలోని బడబళ్లవంక, తలపుల మార్గంలోని గూడరేవుపల్లె వంతెన, ముడుపులవేముల పంచాయతీ యల్లంపల్లె వద్ద ఓదేటి యల్లమ్మ ఆలయం, సదుం రోడ్డులోని ప్రధాన బ్రిడ్జి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



రెడ్డివారిపల్లె వద్ద పొలాల్లోకి చేరిన నీరు - వరద నీటితో ప్రవహిస్తున్న పింఛా నది

రవాణాలో ఆటోడ్రైవర్ల పాత్ర కీలకం

● మేనిఫెస్టోలో లేని పథకం అమలు

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

● జిల్లాలో 8836 మంది లబ్ధిదారులు

● రూ.13.25 కోట్లు పంపిణీ

మదనపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ప్రజా రవాణాలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమని, విద్యార్థి దశలోఆటో డ్రైవర్లతో ఏర్పాడిన సంబంధాన్ని భావోద్వేగ బంధాన్ని మరచిపోలేనని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. మదనపల్లెలో శనివారం వాహనమిత్ర పథకాన్ని రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో వాహనమిత్ర పథకం లేకపోయినా అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్‌లకు ఒక్కొక్కరికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించడంలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నామని, జీఎస్టీ 2.0 ద్వారా ఆటో డ్రైవర్లకు ఆటో మెయింటెనెన్స్ ఖర్చు తగ్గుతుందన్నారు. జిల్లాలో 8,835 మందికి రూ.13.25 కోట్లు లబ్ధి చేకూరిందని చెప్పారు. ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మాత్రమే ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తుందన్నారు. గతంలో పేదలందరికీ ఇళ్ల పథకంలో కేవలం కేంద్రం ఇచ్చే సహాయాన్ని మాత్రమే ప్రజలకు ఇచ్చేవారని, ప్రస్తుతం ఎన్‌డీఏ ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు అమలు చేస్తున్న ఈ పథకంలో వారికి ఆర్థిక సాయమే కాదని, వారి ఆత్మగౌరవాన్ని పెంచడమన్నారు. లబ్ధిదారులకు ఏదైనా సమస్యలు ఉంటే రవాణా శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సబ్‌కలెక్టర్ సూచించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి అశోక్‌ప్రతాప్, దినేష్‌చంద్ర, టీడీపీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



తంబళ్లపల్లెలో ర్యాలీగా వెళుతున్న ఆటో డ్రైవర్లు

రాయచోటిలో 1879 మంది లబ్ధిదారులకు గాను రూ.2,81,85,000 బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. ఇక్కడ టీడీపీ నాయకుడు, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేశారు. మదనపల్లెలో 1672 మంది లబ్ధిదారులకు గాను 2,50,80,000 ఖాతాలో జమ కానున్నాయి. తంబళ్లపల్లెలో 870 మంది లబ్ధిదారులకు గాను 1,30,50,000, ఇక్కడ టీడీపీ నాయకులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తంబళ్లపల్లెలో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నీడ్ మల్లికార్జున నాయుడు, పరిశీలకులు సోముశేఖర్, రెడ్డప్ప, అధికారులతో కలసి కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. రాజంపేటలో 1290 మంది లబ్ధిదారులకు రూ.1,93,50,000 జమ కానున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు, సబ్‌కలెక్టర్ భావన ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. రైల్వేకోడూరులో 1378 మంది లబ్ధిదారులకు రూ.2,06,70,000, ప్రత్యేక అధికారి నరసింహమూర్తి, టీడీపీ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీలేరులో 1747 మంది లబ్ధిదారులకు రూ.2,62,05,000 లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ కానున్నాయి. పీలేరులో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు చెక్కు అందచేశారు.

‘అన్నమయ్య’ రైతుకు తీపి కబురు

● ప్రధాని ధనధాన్య కృషి యోజనకు ఎంపికైన జిల్లా

● దాదాపు 1.70 లక్షల మంది రైతులకు ప్రయోజనాలు

● ప్రతి ఏటా జిల్లాకు రూ.240 కోట్లు

● ఈ ఏడాది రబీ నుంచే ప్రారంభం.. ఆరేళ్లపాటు అమలు



7

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



జమ్మలమడుగు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని పెన్నానది వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దచౌరెడ్డి (55) వ్యక్తి మృతి చెందాడు. జమ్మలమడుగు మండలం అంజనాపురం గ్రామానికి చెందిన పెద్దచౌరెడ్డి ముద్దనూరు రోడ్డువైపు నుంచి ద్విచక్రవాహనంలో జమ్మలమడుగుకు బయల్దేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం రాత్రి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈయన కుమారుడు మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య



మృతుడి శరీరంపై ముందు భాగంలో స్పోర్ట్సు టీషర్టుపై నారాయణ మెడికల్ కాలేజి, వెనుక వైపు చేతన్ అని ఉన్న దృశ్యం

ముద్దనూరు అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల సమీపంలో శనివారం గుర్తుతెలియని యువకుడు (30) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల సమాచారం మేరకు... మృతుని వద్ద జమ్మలమడుగు నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసినట్లు టికెట్ ఉందని, శరీరంపై స్పోర్ట్సు టీషర్టు ఉందని, దానిపై ముందు భాగంలో నారాయణ మెడికల్ కాలేజి 2020, వెనుక చైతన్ అని ప్రింట్ ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు, ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల పోలీసులను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

చాపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరాయిపల్లె గ్రామం వంక బ్రిడ్జి వద్ద శనివారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఎరుపురంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. అతని ఆచూకీ తెలిసినవారు 9121100601 అనే నంబరుకు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు

కాశినాయన అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయపల్లెకు చెందిన గుర్రాల రమణారెడ్డిపై అదే గ్రామానికి చెందిన గుర్రాల రాజకుమార్‌రెడ్డి దాడికి పాల్పడ్డారు. రాజకుమార్‌రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్‌ఐ వివరాలమేరకు.. నాలుగేళ్ల క్రితం రామణారెడ్డి వద్ద రాజకుమార్‌రెడ్డి డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా ఎదురు తిరిగి గొడ్డలితో దాడి చేసి రమణారెడ్డిని గాయపరిచాడు. అతన్ని కడప రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చింతలకుంటలో అగ్ని ప్రమాదం

- రూ.10 లక్షలు నష్టం




అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిలో మంటలు

నందలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతమైన చింతలకుంట గ్రామం హరిజనవాడలో బల్లి ఓబులేశు అనే వ్యక్తి ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. బాధితుల వివరాల మేరకు.. శనివారం ఉదయం ఉదయం 10 గంటల సమయంలో ఇంటిలోని ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాప్తి చెందాయి. ఈ సంఘటనలో రూ.2.50 లక్షల నగదు, బంగారు, ఇంటిలోని పలు రకాల వస్తువులు, దుస్తులు కాలిపోయాయని వాపోయింది. రాజంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

'అన్నమయ్య' రైతుకు తీపి కబురు

- ప్రధాని ధనధాన్య కృషి యోజనకు ఎంపికైన జిల్లా
- దాదాపు 1.70 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- ప్రతి ఏటా జిల్లాకు రూ.240 కోట్లు
- ఈ ఏడాది రబీ నుంచే ప్రారంభం.. ఆరేళ్లపాటు అమలు
- పర్యవేక్షణకు కేంద్రం నుంచి ప్రత్యేక అధికారి



కలికిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు కేంద్రం తీపి కబురు అందజేసింది. ఏడేళ్లుగా ఊరిస్తున్న జిల్లా రైతు ప్రయోజనాల పథకం ఎట్టకేలకు నెరవేరింది. ప్రధాని ధనధాన్య కృషి యోజన పథకం కింద జిల్లా ఎంపికైంది. మొత్తం దేశంలో వ్యవసాయంలో వెనుకబడిన వంద జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేయగా ఏపీ నుంచి నాలుగు జిల్లాలకు అవకాశం దక్కింది. అల్లూరి సీతారామరాజు (ఏఎస్‌ఆర్), శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలను ఎంపిక చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. జిల్లాలోని లక్షా 70 వేల మంది రైతులకు ఈ పథకం కింద అనేక రకాల ప్రయోజనాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అందనున్నాయి. దీని కోసం మొత్తం ఏడాదికి రూ.24 వేల కోట్లు కేటాయించగా అందులో జిల్లా వాటాగా ఏడాదికి రూ.240 కోట్లు అందనున్నాయి. ఈ ఏడాది అక్టోబరు రబీ సీజన్ నుంచి ఇది ప్రారంభం కానుంది. ఆరేళ్లపాటు ఈ పథకం అమలులో ఉంటుంది. దీనికవసరమైన నిధులను గత బడ్జెట్‌లోనే ప్రతిపాదించి ఆమోదించారు. ఈ మేరకు అప్పట్లోనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గత ఫిబ్రవరి 1న ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపులు పూర్తయిన అనంతరం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో దేశ వ్యాప్తంగా తీవ్రంగా వెనుకబడిన 120 జిల్లాలను గుర్తించారు. అందులో చివరికి 100 జిల్లాలను ఎంపిక చేశారు. అందులో ఏపీ నుంచి వ్యవసాయ ఉత్పాదక రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేక వెనుకబడిన నాలుగు జిల్లాలు ఎంపికయ్యాయి. అందులో అవకాశం దక్కడం జిల్లా రైతాంగానికి పెద్ద ఉపశమనంగా చెబుతున్నారు. ఈ పథకాన్ని పటిష్టవంతంగా అమలు చేసి నేరుగా రైతు ముంగిటకు ప్రయోజనాలను చేర్చడానికి అనేక రకాల చర్యలు చేపడుతున్నారు.

నీతి ఆయోగ్ పర్యవేక్షణలో

ధనధాన్య కృషి యోజన పథకాన్ని నీతి ఆయోగ్ పర్యవేక్షించనుంది. వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, కేవీకేలు ఇతర వ్యవసాయ విస్తరణాంశాలను సమన్వయం చేసి పూర్తి స్థాయిలో ఒక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనుంది. జిల్లా స్థాయిలో కలెక్టరు ఆధ్వర్యంలో కమిటీలు, రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 11 మంత్రిత్వ శాఖల ద్వారా అమలవుతున్న 36 వివిధ రకాల పథకాలను దీనికి అనుసంధానించనున్నారు. మొత్తం 117 పనితీరు సూచికల ద్వారా పథకం అమలును, ఫలితాలను ఎప్పటికప్పుడు క్రోడీకరించి ఫలితాలను విశ్లేషించనున్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, పంటల్లో వైవిధ్యత, రుణాలను పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లోనే అవకాశాలను సృష్టించడంలాంటి అంశాలపై నీతి ఆయోగ్ దృష్టి సారించనుంది. పంట నష్టాలను తగ్గించుకోవడానికి కోతల అనంతరం నిల్వ సామర్థ్యాలను పెంచడానికి గ్రామ, మండల స్థాయిలో సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు. పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయనున్నారు. యూరియా కొరత లేకుండా సరఫరాకు ప్రాధాన్యమివ్వనున్నారు. మొత్తానికి సంప్రదాయం పంటల నుంచి ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో వాణిజ్య పంటలపై దృష్టి పెట్టనున్నారు. అదే విధంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తుల కోసం సమగ్ర ప్రణాళిక అమలు చేయనున్నారు.

పథకం నేపథ్యమిదీ!

పీఎం ధనధాన్య కృషి యోజన పథకం వెనుక పెద్ద కథనమే ఉంది. విభజిత ఏపీలో వెనుకబాటు జిల్లాలైన రాయలసీమ, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళంలకు ప్రత్యేక ప్రాధాన్యాలను ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచారు. 2014-19 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ ప్రత్యేక ప్రయోజనాల నిధులను రాబట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు. చివరికి దీనిపై 2018లో ప్రధాని మోదీ సానుకూలంగా ప్రకటన చేసినా ఆ తరువాత కేంద్రంతో సత్సంబంధాలు లేకపోవడంతో అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు దీని ఊసెత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తరచూ కేంద్రంపై ఒత్తిడి పెంచడంతో మొన్నటి కేంద్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న దీని గురించి ప్రకటన చేశారు. బడ్జెట్‌కు ఆమోదం లభించడంతో జూలై 16న కేంద్ర మంత్రివర్గం దీనిని ఆమోదించింది. అప్పటి నుంచి జిల్లాల ఎంపికపై జరిగిన కసరత్తు పూర్తి కావడంతో శుక్రవారం దీని విధివిధానాలను కేంద్రం ప్రకటించింది. అయితే ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రమే రెండు జిల్లాలను ఎంపిక చేశారు. ఉమ్మడి కడప, చిత్తూరులో నాలుగు జిల్లాలున్నా చివరికి కేవలం ఒక్క అన్నమయ్యకు మాత్రమే అవకాశం లభించింది. ఇక ఏజెన్సీ జిల్లా ఏఎస్‌ఆర్ కూడా స్థానం దక్కించుకుంది.

జిల్లా పర్యవేక్షణకు కేంద్ర అధికారి



బాలమురుగన్

ఆరేళ్ల కాలం.. ఏడాదికి రూ.240 కోట్లు, దాదాపు లక్షా 70 వేల మంది రైతుల ప్రయోజనాలు, దీర్ఘకాలిక ఫలితాలు.. ఈ కారణంగానే మొక్కుబడిగా నిధులు కేటాయించడం కాకుండా పథకాలను అనుక్షణం పర్యవేక్షించి ఫలితాలు రాబట్టడానికి నేరుగా కేంద్రమే అమలు బాధ్యత చేపట్టింది. ఇందులో భాగంగా పర్యవేక్షణ కోసం ఒక్కో జిల్లాకు కేంద్ర నుంచి ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారులుగా నియమించారు. అన్నమయ్యకు సంబంధించి తమిళనాడుకు చెందిన ఐఏఎస్ (2005 బిహార్ కేడర్) అధికారి డి.బాలమురుగన్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం కేంద్రంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. స్వతహాగా వ్యవసాయ పట్టభద్రుడైన బాలమురుగన్ బిహార్‌లో ఆరు జిల్లాల్లో కలెక్టరుగా పనిచేసిన అనుభవముంది. జిల్లాలో రబీ సీజన్ నుంచి నోడల్ అధికారి బాలమురుగన్ ధనధాన్య కృషి యోజన పథకం అమలును చేపట్టనున్నారు. ప్రధానంగా జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, మార్కెటింగ్ శాఖలు చురుగ్గా వ్యవహరించాల్సి ఉంది. మొత్తం 11 వివిధ మంత్రిత్వ శాఖలు, వాటి ద్వారా అమలవుతున్న 36 రకాల పథకాలను ధనధాన్య కృషి యోజనతో సమన్వయం చేయనున్నారు.

వాటర్ గ్రిడ్ పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్



సీబీఆర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

లింగాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వాటర్ గ్రిడ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని.. పనుల్లో వేగం పెంచి డిసెంబరు 15వ తేదీ నాటికి పులివెందుల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పార్నపల్లె గ్రామ సమీపంలో రూ.450కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనులను, సీబీఆర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో సాగు, తాగునీటి కొరత రాకుండా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పీబీసీ, లింగాల కుడికాల్వ పరిధిలోని అన్ని చెరువులను నింపాలన్నారు. అలాగే సీబీఆర్ ప్రాజెక్టు మర మ్మత్తు పనులు చేపట్టాలన్నారు. హెచ్‌ఎల్‌సీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ సీబీఆర్ పరిధిలోని ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆర్‌డీఓ చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు, పీబీసీ ఈఈ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో భారీ వర్షం



జలమయమైన కోడూరు-తిరుపతి రహదారి

రైల్వేకోడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. పాదచారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు వర్షం కురవడంతో రైల్వేకోడూరు-తిరుపతి మార్గంలో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. రైల్వేకోడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి, తదితర వీధి రోడ్లు జలమయమయ్యాయి. వ్యాపార దుకాణాల్లోకి వర్షపు నీరు ప్రవేశించడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.



జలమయమైన రైల్వేస్టేషన్ రోడ్డు

పట్టాభిరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టాభిరామాలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ శనివారం టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యే క పూజలు జరిగాయి. సాయంత్రం కలశస్థాపన చేసి స్వామివారి పవిత్రోత్సవాలకు విశేష భక్తజనం నడుమ అంకురార్పణ చేశారు.

కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, భాషికాచార్యులు, కృష్ణరాజు, గోకుల్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌కు వాల్మీకిపురం క్రీడాకారుడు



వాల్మీకిపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌లో వాల్మీకిపురానికి చెందిన దీపన్‌సాయినాథ్ ఎంపికైనట్లు హెడ్ కోచ్ సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక జీవీఎస్‌సీఎస్ మైదానంలో ఏసీఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాంపులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఎంపికైనట్లు తెలియజేశారు. మదనపల్లె జోన్ నుంచి మొదటిసారి రంజీ ప్రాబబుల్స్‌కు దీపన్ సాయినాథ్ ఎంపికవడం పట్ల స్థానిక అసోసియేషన్ పెద్దలు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కడప మారుతీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప-రాజంపేట రోడ్డులోని గర్ల్స్ ఐటీఐ కాలేజీ పక్కన గల శిక్షణ సంస్థలో కెనరా బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టరు ఆరిఫ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 నుంచి 45 సంవత్సరాల్లోపు గల వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు


కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కడప జిల్లా అపుస్మా ఆధ్వర్యంలో ఆదివారం ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అపుస్మా జిల్లా అధ్యక్షుడు బి.గంగయ్య, సెక్రటరీ, శివశంకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, బి.రామగోపాల్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఆర్జేడీ శ్యామ్యూల్, డీఈఓ షంషుద్దీన్, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు.

32 మద్యం బాటిళ్లు స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

కడప క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవుని కడప దగ్గరలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 32 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్‌ఐ రాజ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేర కు అతన్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

దసరా ఎగ్జిబిషన్‌లో నిలువు దోపిడీ

- ఎంట్రీ ఫీజు రూ.35కు రూ.80 వసూలు
- వినోద పరికరాలకు రూ.150



ప్రొద్దుటూరు దసరా ఎగ్జిబిషన్ కాంతులు

ప్రొద్దుటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు దసరా సంబరాల్లో భాగంగా మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. మున్సిపాలిటీ గెజిట్ ప్రకారం పెద్దలకు రూ.35, పిల్లలకు రూ.25లు ఎంట్రీ టికెట్లు నిర్ణయించగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు మొదటి రోజు నుంచి ఎంట్రీ ఫీజు రూ.50 వసూలు చేస్తున్నారు. విజయదశమి రోజు రూ.100 వసూలు చేయగా, ఆ తరువాత రోజు నుంచి రూ.80 వసూలు చేస్తున్నారు. వినోద పరికరాలకు సైతం విజయదశమి రోజు రూ.100 టికెట్లు నిర్ణయించగా రూ.150 వసూలు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏదైనా తినాలని చూసినా ధరలు డబుల్ త్రిబుల్ వసూళ్లు చేస్తున్నారు. వాటర్ బాటిల్ రూ.40, కూల్ డ్రింక్స్ రూ.50 గోబి, నూడిల్స్ ఏదైనా రూ.60 ముక్కుపిండి తీసుకుంటున్నారు. ఈ తీరుగా ఎంట్రీ టికెట్ల దగ్గర నుంచి అన్ని రకాల వినోద పరికరాలతో పాటు తినుబండరాలు సైతం అధిక రేట్లకు విక్రయించి ప్రజలను వినోదం పేరిట నిలువు దోపిడీ చేస్తున్నా మున్సిపల్ అధికారులు అటు వైపు తొంగి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మున్సిపాలిటీకి రూ.2.25 కోట్లు లీజు చెల్లించకుండా...

ఎగ్జిబిషన్ నిర్వాహకులు మున్సిపాలిటీకి పూర్తిగా లీజు చెల్లించాకే అనుమతి ఇవ్వాలని గెజిట్‌లో ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు లీజు మొత్తం చెల్లించకనే ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతులు ఇవ్వడంపై వైసీపీ మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అధికార టీడీపీ మండల స్థాయి నాయకుడు కావడంతో మున్సిపల్ అధికారులు అధికార పార్టీ పెద్దల ఒత్తిళ్లకు లొంగి అనుమతులు ఇచ్చారు. మొత్తం రూ 2.25 కోట్లు చెల్లించాల్సి ఉంటే.. ఇప్పటి వరకు రూ.90లక్షలు మాత్రమే చెల్లించినట్లు మున్సిపల్, రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు. దసరా పర్వదినాల్లో ఎగ్జిబిషన్‌లో ఎంట్రీ ఫీజు, వినోద పరికరాలకు సంబంధించి మున్సిపల్ గెజిట్ ధరల పట్టికను మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీలు వేసి ప్రదర్శించక పోవడంపై ఆరోపణలున్నాయి. నిర్వాహకులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి వారికి సహకరించారని సమాచారం.

అధిక వసూళ్లపై చర్యలు తీసుకుంటాం

ఎంట్రీ ఫీజు అధికంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ గెజిట్ ప్రకారం ఎంట్రీ ఫీజుతో పాటు వినోద పరికరాలు, తినుబండరాల ధరలు ఫ్లెక్సీలు వేసి ప్రదర్శిస్తాం. గడువు లోపు లీజు మొత్తంను వసూలు చేస్తాం.

\- రమేష్, మున్సిపల్ ఆర్ఐ

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పెద్దపీట

● సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావన



రాజంపేట: ఆటో కార్మికులకు చెక్కులు పంపిణీ చేస్తున్న సబ్‌కలెక్టర్ భావన, చమర్తి జగన్‌మోహన్‌రాజు



రాయచోటి: ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర చెక్కులు అందజేస్తున్న ఆర్డీవో ప్రసాద్, మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి



రైల్వేకోడూరులో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేసిన అధికారులు, నాయకులు

రాజంపేట టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన తెలిపారు. శనివారం వాహనమిత్ర పథకం అమలు చేస్తుండడంతో పట్టణంలోని ఆటోవాలాలు జూనియర్ కళాశాల క్రీడా మైదానం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, డీసీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో 1290 మంది డ్రైవర్లు ఎంపికయ్యారన్నారు. చమర్తి జగన్‌మోహన్‌రాజు, డీసీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వాహనమిత్ర పథకం ఆటో డ్రైవర్లకు వరమన్నారు. ఆటో డ్రైవర్లు తమ ఖాతాలో జమ అయిన రూ.15 వేలు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. డ్రైవర్లకు ఆటోనగర్‌పేరిట ప్రత్యేక కాలనీ ఏర్పాటుకు కృషి చేస్తామ న్నారు. అనంతరం ఆటో డ్రైవర్లతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి డ్రైవర్లకు వాహనమిత్ర చెక్కు ు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీడీవో వరప్రసాద్, ఎంవీఐ వినోద్‌కుమార్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, గీతాంజలి రమణ, డాక్టర్ నవీనచంద్ర, పెద్దఎత్తున ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వాహనమిత్ర ఆటో డ్రైవర్లకు వరం : మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటి-కలెక్టరేట్: వాహనమిత్ర పథకం ఆటో డ్రైవర్లకు వరం లాంటిదని ఆర్డీవో ప్రసాద్ తెలిపారు. రాయచోటిలో శనివారం వాహనమిత్ర పథకాన్ని లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆటో డ్రైవర్లను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. జిల్లా మొత్తం 13,25,40,000 రూపాయలను డ్రైవర్ల ఖాతాల్లో జమ చేసినట్లు వారు తెలిపారు. మొత్తం 436 కోట్లు ఖర్చు చేసి అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో 1, 875 మంది ఖాతాల్లో 2,81,85,000 ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవి, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్ నాయుడు, దేవపట్ల సింగిల్‌విండో అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి, కుప్పం ఎన్నికల పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రైల్వేకోడూరు: రవాణా రంగ అభివృద్ధితో పాటు ఆటో డ్రైవర్ల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసింహమూర్తి తెలిపారు. రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయం సభాభవనంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌సేవా పథకం కింద రైల్వేకోడూరులో 1378 మంది ఆటో డ్రైవర్లకు సాయమందించామన్నారు. వాహనమిత్ర పథకం ఆటో డ్రైవర్లకు వరమని తెలిపారు. ఆటో డ్రైవర్లకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్ కృషితో ఆటోడ్రైవర్లకు చెక్కులు అందజేసినట్లు టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన 1378 మంది ఆటో డ్రైవర్లకు ఈ పథకం ద్వారా మొత్తం రూ.2,06,70,000 రూపాయలు అందిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కోనేటి అమర్‌నాథ్, ఎంపీడీవో నాగిరెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




ఒంటిమిట్ట: చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఒంటిమిట్ట: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య తెలిపారు. శనివారం ఆటో డ్రైవర్లతో కలిసి ఆయన చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, మోదుగుల నరసింహులు, జనసేన నాయకుడు మాడా జయకృష్ణ, బీజేపీ నాయకులు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల



నదిలోకి విడుదలవుతున్న నీరు

సుండుపల్లె, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): పింఛా (యర్రపురెడ్డి ఆది నారాయణ రెడ్డి) ప్రాజెక్టులోకి పైప్రాంతాల నుంచి భారీగా వర్షపు నీరు చేరుతున్నట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ తెలిపారు. పై ప్రాంతాల నుంచి 6,829 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరు తుండడంతో 6,412 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు రెండు ప్రధాన గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. వరద మరింత పెరిగితే అధిక నీటి ని నదిలోకి విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కుడి, ఎడమ కాలువలకు కూడా నీటిని విడుదల చేశామన్నారు. ప్రాజెక్టు దిగువ భాగం లో నదీ పరిసరాల్లోకి ప్రజలు ఎవరూ వెళ్లరాదని పరివాహక ప్రాంత ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సమాచారాన్ని చేరవేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసులపై దృష్టి పెట్టాలని వినతి



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

రాయచోటి కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బండకింద మనోహర్, సత్యాల రామకృష్ణ, వెంకట్రమణ విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నిమిత్తం నెలలో ఒకరోజు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు కాంపెన్సేషన్ సకాలంలో అందడం లేదని, జిల్లాలోని పలు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌరహక్కుల దినోత్సవం సివిల్ రైట్స్ డే నిర్వహించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈ నెల 8వ తేదీన జరిగే జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సంబంధిత అధి కారులకు ఆదేశాలు జారీ చేసి ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారని వారు తెలిపారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్ర భూ రీసర్వే సందర్భంగా అధికారులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సుబ్ర మణ్యంరెడ్డి తెలిపారు. శనివారం మోటకట్ల గ్రామ సచివాలయంలో రీసర్వే సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రీసర్వే ప్రారంభినట్లు తెలిపారు. సర్వేయింగ్ అధికారులకు రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులు చూపించాలని తెలియజేశారు. సర్వే సమయంలో అందు బాటులో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ హరికృష్ణ, పీఎన్‌కాలనీ సర్పంచ్ మోహన్, అమర్‌నాథ్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెయ్యయాదవ్, మహదేవపల్లి ప్రసన్నకుమార్‌రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

తూముకుంటలో వైద్య శిబిరం

గాలివీడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూముకుంట గ్రామంలో అతెనా సోలార్ సంస్థ సహకారంతో ప్రేరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం కోసం వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు జితేశ్, హెల్త్ సూపర్‌వైజర్ గిరిధర్ ఆధ్వర్యంలో రక్తపోటు, చక్కెర, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవసరమైన వైద్య సూచనలు అందజేశారు. మొత్తం 44 మంది గ్రామస్తులు ఈ ఆరోగ్య శిబిరం ద్వారా లబ్ధి పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అతేనా సోలార్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


'5జీ మొబైల్స్ ఇచ్చేవరకు పని చేయలేం'

ఒంటిమిట్ట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : 5జీ మొబైల్స్ ఇచ్చేవరకు తాము పనిచేయలేమని మండలంలోని వెలుగు యానిమేటర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఏపీఎం అశోక్‌కుమార్‌రెడ్డికి తమ సమ్మె నోటీసులు అందజేశారు. ఈ నెల 1 నుంచి తాము సమ్మె చేస్తున్నట్లు తెలియజేశారు. 5జీ మొబైల్స్ ఇచ్చేవరకు ఆన్‌లైన్ పనులు చేయలేమన్నారు. ప్రతి పనికి టార్గెట్ ఇచ్చి ఒత్తిడి పెంచుతున్నారన్నారు. వేతనాలు కూడా ప్రతినెలా చెల్లించడం లేదన్నారు. మండలంలోని యానిమేటర్లు పాల్గొన్నారు.

పెస్టిసైడ్స్ దుకాణం లైసెన్సు రద్దుకు సిఫారసు

రాజంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : విక్రయాలు, కొనుగోళ్లు లేని క్రిమి సంహారక మందుల దుకాణానికి అనుమతులు రద్దు చేయాలని విజిలెన్స్ అధికారులు సిఫారసు చేశారు. పెనగలూరు మండల కేంద్రంలోని ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలపై రెండు రోజుల క్రితం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ దుకాణంలో యజమాని అందుబాటులో లేకపోగా, తమ దుకాణంలో కొనుగోళ్లు, అమ్మకాలు లేవని సిబ్బంది తెలపడంతో రికార్డులను పరిశీలించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు వారు చెప్పే సమాధానాలకు పొంతన లేకపోవడంతో.. నిరుపయోగంగా ఉన్న దుకాణం అనుమతులు రద్దు చేయాలని స్థానిక అగ్రికల్చర్ అధికారికి సూచించారు. ఈ విషయంపై పెనగలూరు ఏవో వీఎన్‌కే సుబ్రమణ్యంను వివరణ కోరగా మూడు రోజుల కిందట విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసిన విషయం వాస్తవమేనని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను నడుచుకోగలనని తెలిపారు.

వైభవంగా దుర్గమ్మ ఊరేగింపు



నిమజ్జనానికి వెళుతున్న దుర్గమ్మ

పెనగలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వినాయకనగర్‌లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గమ్మ విగ్రహాన్ని శనివారం ఊరేగించారు. అనంతరం ఎన్‌ఆర్‌పురం సమీపంలోని గుంజనేరులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక నగర్‌లో గ్రామ పెద్దలతో పాటు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రామాచార్లపల్లె పంచాయతీ, నిమ్మనపల్లె రోడ్డు, వశిష్ఠ స్కూల్ సమీప కాలనీ ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి శనివారం తొలగించారు. కాలనీ సమీపంలో 20 కుంటల వరకు ప్రభుత్వ స్థలం ఉందని ఇందులో బయట వ్యక్తులు రోజుకొకరు తమదంటూ వస్తుండడంతో కాలనీ వాసులు సుమారు 700 కుటుంబాలు ఉన్నాయని, ప్రభుత్వ భూమి బడి, గుడి, వైద్యశాలకు కేటాయించాలని, పరులకు సొంతం చేయకూడదని తహసీల్దార్‌కు విన్నవించారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకే ఇక్కడ పశువుల పాకలు వేశామన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే తాము తొలగిస్తామన్నారు. వెంటనే ఆక్రమణలను తొలగించి హెచ్చారిక బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. కాలనీ వాసులు రెడ్డెప్ప నాయక్, శాంతమ్మ, బాలాజీ, రాణమ్మ, మీనా, భావన, ముంతాజ్, శ్యామల, మధు, చందు, హరీష్, లక్ష్మీ దేవి, లావణ్య, శృతి, నారాయణమ్మ ఆర్‌ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు

కలకడ అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజన్నను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకు పూజ చేశారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

● మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనిచేయడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లవు రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్ మాట్లాడుతూ మండలంలోని మాధవరం, గొర్లముదివేడు, వరిగపాపిరెడ్డిగారిపల్లెలో తాగునీటి ఎద్దడి ఉన్న 24 ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఇంకా ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఉందనే విష యాన్ని తమ దృష్టికి తీసుకొస్తే ఆ ప్రాంతాలకు కూడా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి మాట్లాడుతూ గ్రామాలకు వివిధ శాఖల ద్వారా మంజూరైన ప్రభుత్వ భవనాలను ఊరికి దూరంగా నిర్మిస్తుండున అవి నిరుపయోగం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్లు గుర్తించి అందరికీ అనుకూలమైన ప్రాంతంలో భవనాలను నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం సిరికల్చర్ అధికారిణి సింధూజా మాట్లాడుతూ పట్టు పరిశ్రమను ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వం పలు రకాలుగా కృషి చేస్తోందన్నారు. ఏఈవో మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, యంత్రాలు, పరికరాలపై జీఎస్టీని తగ్గించడం రైతులకు లాభదాయమన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో పంటలు సాగు చేయలేకపోయిన రైతులకు రబీ సీజన్‌లో సబ్సిడీపై విత్తనాలను అందజేస్తామన్నారు. అనంతరం ఉపాధి ఏపీవో రమేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు తాగునీటి సౌకర్యం కోసం 20 తొట్లను నిర్మించామన్నారు. రైతులు తమ పొలాల్లో పండ్ల మొక్కలను పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. గడ్డి పెంపకానికి కూడా తోడ్పాటు ఇస్తున్నామన్నారు. తమ పొలాలు, తోటల చుట్టూ కందకాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎంఈవో బాలాజీనాయక్ మాట్లాడుతూ డిసెంబర్‌లోగా టెన్త్ సిలబస్ పూర్తి చేసి, తర్వాత రివ్యూ చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు కూడా పాఠశాలలను సందర్శించి విద్యాభివృద్ధికి తగు మేర తోడ్పాటును ఇవ్వాలని సూచించారు. అనంతరం ఉద్యానవనశాఖ అధికారి మాట్లా డుతూ పొలాల్లో ప్యాక్ హౌస్‌ల నిర్మాణానికి రూ.2 లక్షల సబ్సిడీతో రూ.4 లక్షలను అందజేస్తామన్నారు. సబ్సిడీ కింద నీటి గుంతలు ఏర్పాటు, పంటల సాగుకు పట్టలు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు అందిస్తున్నట్టు వివరించారు. అనంతరం పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు సైకం జైపాల్‌రెడ్డి, పార్వతమ్మతో పాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు ఆత్మీయ వీడ్కోలు



ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) అన్నమయ్య జిల్లా ఎస్పీ 14 నెలల పాటు విధులు నిర్వహించి బదిలీపై కృష్ణా జిల్లాకు వెళ్లిన వి. విద్యాసాగర్ నాయుడును శనివారం రాత్రి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దంపతులను కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారం మరువలేనిదన్నారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ తాను పాడేరు ఏఎస్పీగా పనిచేస్తున్నపుడు విద్యాసాగర్ నాయుడు చింతపల్లి ఏఎస్పీగా విధులు నిర్వహిస్తూ మావోయిస్టులను కట్టడి చేయడంలో కీలకపాత్ర పోషించాడని వివరించారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. అదనపు ఎస్పీ వెంకటాద్రి, పలువురు డీఎస్పీలు, పోలీసు అధికారులు, టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ ఎస్పీ అందించిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, మదనపల్లి డీఎస్పీ ఎస్.మహేంద్ర, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీని వాసులు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది, హోం గార్డు లు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు బీడు.. అధికారులకు పట్టని గోడు

● కట్టుకాలువకు గండితో కుంటుబడిన సాగు ● రైతుల్లో ఆందోళన



కట్టుకాలువకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

చిన్నమండెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇసుక, మట్టి దోచుకోవడం మీద పెట్టిన శ్రద్ధ రైతుల సంక్షేమం మీద పెట్టలేదని వండాడి గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. పెద్ద ఎత్తున ఇసుకను తవ్వి రోజూ వందలాది ట్రాక్టర్లతో తరలించడంతో మాండవ్యనది కోతకు గురై గుండ్రాజుచెరువుకి వెళ్లే కట్టు కాలువ తెగాపోయిందని ఆరోపిస్తున్నారు. ఈ విషయం పై నాలుగేళ్ల వ్యవధిలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా గండి పూడ్చకపోవడంతో తూర్పుపల్లి, తొట్టికాడ కుర్వపల్లి, కావలివాండ్లపల్లె, గాండ్లపల్లి, గొర్లముదివేడు గ్రామాలకు చెందిన రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

మండలంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో గుండ్రాజు చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద వందలాది ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరు వుకు నీరందించేందుకు మాండవ్యనది నుంచి ఒకటిన్నర కిలోమీటరు పొడవునా కట్టుకాలువ నిర్మించారు. మాండవ్య నది ప్రవహించిన ప్రతి సారీ గుండ్రాజు చెరువు నిండేది. ఒక సారి చెరువు నిండితే నాలుగైదు పంటలు సాగు చేయవచ్చని రైతులు చెబుతున్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను అక్రమంగా తవ్వేయడంతో కట్టుకాలువకు గండి పడి నీరంతా వృథా అవుతోందని రైతులు చెబుతున్నారు.

ఈ విషయంపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో పొలాలు సాగు చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఐదు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ మైనా ఆ కట్టుకాలువలకు మరమ్మతులు చేసి తమకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీరు లేక పైరు ఎండి పోతోంది



గుండ్రాజుచెరువు కింద రెండు ఎకరాల భూమి ఉంది. కట్టుకాలువ గండి పూడిస్తే చెరువు నిండుతుంది. పైరు ఎండిపోకుండా పంట చేతికి వస్తుంది

- సహదేవరెడ్డి, తూర్పుపల్లి

ఆరు గ్రామాలకు సాగునీరు



కట్టుకాలువ గండి పూడిస్తే ఆరు గ్రామాలకు సాగునీరు అందు తుంది. గండి పూడ్చి మాండ వ్యనది నీరు గుండ్రాజు చెరువు కు చేరేలా చర్యలు తీసుకోవాలి.

- ఇంజేటి వెంకట్రమణ, గాండ్లపల్లె

వరిమడి ఎండిపోతోంది



బోరు కింద రెండు ఎకరాలు వరినారు వేశా ను. నీరు చాలక మడి ఎండిపోతోంది. కట్టు కాలువ గండి పూడిస్తే వరి సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

- యండపల్లి రాజారెడ్డి, తూర్పుపల్లి

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



జమ్మలమడుగు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని పెన్నానది వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దచౌరెడ్డి (55) వ్యక్తి మృతి చెందాడు. జమ్మలమడుగు మండలం అంజనాపురం గ్రామానికి చెందిన పెద్దచౌరెడ్డి ముద్దనూరు రోడ్డువైపు నుంచి ద్విచక్రవాహనంలో జమ్మలమడుగుకు బయల్దేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం రాత్రి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈయన కుమారుడు మూడేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య



మృతుడి శరీరంపై ముందు భాగంలో స్పోర్ట్సు టీషర్టుపై నారాయణ మెడికల్ కాలేజి, వెనుక వైపు చేతన్ అని ఉన్న దృశ్యం

ముద్దనూరు అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల సమీపంలో శనివారం గుర్తుతెలియని యువకుడు (30) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల సమాచారంమేరకు... మృతుని వద్ద జమ్మలమడుగు నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన టికెట్ ఉందని, శరీరంపై స్పోర్ట్సు టీషర్టు ఉందని, దానిపై ముందు భాగంలో నారాయణ మెడికల్ కాలేజి 2020, వెనుక చైతన్ అని ప్రింట్ ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు, తెలిపారు. ఎర్రగుంట్ల పోలీసులను సంప్రదించాలన్నారు.


'అన్నమయ్య' రైతుకు తీపి కబురు

- ప్రధాని ధనధాన్య కృషి యోజనకు ఎంపికైన జిల్లా
- దాదాపు 1.70 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- ఏటా జిల్లాకు రూ.240 కోట్లు
- ఈ ఏడాది రబీ నుంచే ప్రారంభం.. ఆరేళ్లపాటు అమలు
- పర్యవేక్షణకు కేంద్రం నుంచి ప్రత్యేక అధికారి

కలికిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు కేంద్రం తీపి కబురు అందజేసింది. ఏడేళ్లుగా ఊరిస్తున్న జిల్లా రైతు ప్రయోజనాల పథకం ఎట్టకేలకు నెరవేరింది. ప్రధాని ధనధాన్య కృషి యోజన పథకం కింద జిల్లా ఎంపికైంది. మొత్తం దేశంలో వ్యవసాయంలో వెనుకబడిన వంద జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేయగా ఏపీ నుంచి నాలుగు జిల్లాలకు అవకాశం దక్కింది. అల్లూరి సీతారామరాజు (ఏఎస్‌ఆర్), శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలను ఎంపిక చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. జిల్లాలోని లక్షా 70 వేల మంది రైతులకు ఈ పథకం కింద అనేక రకాల ప్రయోజనాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అందనున్నాయి. దీని కోసం మొత్తం ఏడాదికి రూ.24 వేల కోట్లు కేటాయించగా అందులో జిల్లా వాటాగా ఏడాదికి రూ.240 కోట్లు అందనున్నాయి. ఈ ఏడాది అక్టోబరు రబీ సీజన్ నుంచి ఇది ప్రారంభం కానుంది. ఆరేళ్లపాటు ఈ పథకం అమలులో ఉంటుంది. దీనికవసరమైన నిధులను గత బడ్జెట్‌లోనే ప్రతిపాదించి ఆమోదించారు. ఈ మేరకు అప్పట్లోనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గత ఫిబ్రవరి 1న ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపులు పూర్తయిన అనంతరం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో దేశ వ్యాప్తంగా తీవ్రంగా వెనుకబడిన 120 జిల్లాలను గుర్తించారు. అందులో చివరికి 100 జిల్లాలను ఎంపిక చేశారు. అందులో ఏపీ నుంచి వ్యవసాయ ఉత్పాదక రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేక వెనుకబడిన నాలుగు జిల్లాలు ఎంపికయ్యాయి. అందులో అవకాశం దక్కడం జిల్లా రైతాంగానికి పెద్ద ఉపశమనంగా చెబుతున్నారు. ఈ పథకాన్ని పటిష్టవంతంగా అమలు చేసి నేరుగా రైతు ముంగిటకు ప్రయోజనాలను చేర్చడానికి అనేక రకాల చర్యలు చేపడుతున్నారు.

నీతి ఆయోగ్ పర్యవేక్షణలో

ధనధాన్య కృషి యోజన పథకాన్ని నీతి ఆయోగ్ పర్యవేక్షించనుంది. వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, కేవీకేలు ఇతర వ్యవసాయ విస్తరణాంశాలను సమన్వయం చేసి పూర్తి స్థాయిలో ఒక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనుంది. జిల్లా స్థాయిలో కలెక్టరు ఆధ్వర్యంలో కమిటీలు, రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 11 మంత్రిత్వ శాఖల ద్వారా అమలవుతున్న 36 వివిధ రకాల పథకాలను దీనికి అనుసంధానించనున్నారు. మొత్తం 117 పనితీరు సూచికల ద్వారా పథకం అమలును, ఫలితాలను ఎప్పటికప్పుడు క్రోడీకరించి ఫలితాలను విశ్లేషించనున్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, పంటల్లో వైవిధ్యత, రుణాలను పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లోనే అవకాశాలను సృష్టించడంలాంటి అంశాలపై నీతి ఆయోగ్ దృష్టి సారించనుంది. పంట నష్టాలను తగ్గించుకోవడానికి కోతల అనంతరం నిల్వ సామర్థ్యాలను పెంచడానికి గ్రామ, మండల స్థాయిలో సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు. పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయనున్నారు. యూరియా కొరత లేకుండా సరఫరాకు ప్రాధాన్యమివ్వనున్నారు. మొత్తానికి సంప్రదాయం పంటల నుంచి ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో వాణిజ్య పంటలపై దృష్టి పెట్టనున్నారు. అదే విధంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తుల కోసం సమగ్ర ప్రణాళిక అమలు చేయనున్నారు.



పథకం నేపథ్యమిదీ!

పీఎం ధనధాన్య కృషి యోజన పథకం వెనుక పెద్ద కథనమే ఉంది. విభజిత ఏపీలో వెనుకబాటు జిల్లాలైన రాయలసీమ, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళంలకు ప్రత్యేక ప్రాధాన్యాలను ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచారు. 2014-19 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ ప్రత్యేక ప్రయోజనాల నిధులను రాబట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు. చివరికి దీనిపై 2018లో ప్రధాని మోదీ సానుకూలంగా ప్రకటన చేసినా ఆ తరువాత కేంద్రంతో సత్సంబంధాలు లేకపోవడంతో అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ దీని ఊసెత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తరచూ కేంద్రంపై ఒత్తిడి పెంచడంతో మొన్నటి కేంద్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న దీని గురించి ప్రకటన చేశారు. బడ్జెట్‌కు ఆమోదం లభించడంతో జూలై 16న కేంద్ర మంత్రివర్గం దీనిని ఆమోదించింది. అప్పటి నుంచి జిల్లాల ఎంపికపై జరిగిన కసరత్తు పూర్తి కావడంతో శుక్రవారం దీని విధి విధానాలను కేంద్రం ప్రకటించింది. అయితే ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రమే రెండు జిల్లాలను ఎంపిక చేశారు. ఉమ్మడి కడప, చిత్తూరులో నాలుగు జిల్లాలున్నా చివరికి కేవలం ఒక్క అన్నమయ్యకు మాత్రమే అవకాశం లభించింది. ఇక ఏజెన్సీ జిల్లా ఏఎస్‌ఆర్ కూడా స్థానం దక్కించుకుంది.

జిల్లా పర్యవేక్షణకు కేంద్ర అధికారి



బాలమురుగన్

ఆరేళ్ల కాలం.. ఏడాదికి రూ.240 కోట్లు, దాదాపు లక్షా 70 వేల మంది రైతుల ప్రయోజనాలు, దీర్ఘకాలిక ఫలితాలు.. ఈ కారణంగానే మొక్కుబడిగా నిధులు కేటాయించడం కాకుండా పథకాలను అనుక్షణం పర్యవేక్షించి ఫలితాలు రాబట్టడానికి నేరుగా కేంద్రమే అమలు బాధ్యత చేపట్టింది. ఇందులో భాగంగా పర్యవేక్షణ కోసం ఒక్కో జిల్లాకు కేంద్ర నుంచి ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారులుగా నియమించారు. అన్నమయ్యకు సంబంధించి తమిళనాడుకు చెందిన ఐఏఎస్ (2005 బిహార్ కేడర్) అధికారి డి.బాలమురుగన్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం కేంద్రంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. స్వతహాగా వ్యవసాయ పట్టభద్రుడైన బాలమురుగన్ బిహార్‌లో ఆరు జిల్లాల్లో కలెక్టరుగా పనిచేసిన అనుభవముంది. జిల్లాలో రబీ సీజన్ నుంచి నోడల్ అధికారి బాలమురుగన్ ధనధాన్య కృషి యోజన పథకం అమలును చేపట్టనున్నారు. ప్రధానంగా జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మార్కెటింగ్ శాఖలు చురుగ్గా వ్యవహరించాల్సి ఉంది. మొత్తం 11 వివిధ మంత్రిత్వ శాఖలు, వాటి ద్వారా అమలవుతున్న 36 రకాల పథకాలను ధనధాన్య కృషి యోజనతో సమన్వయం చేయనున్నారు.

ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌కు వాల్మీకిపురం క్రీడాకారుడు



వాల్మీకిపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌లో వాల్మీకిపురం వాసి దీపన్‌సాయినాథ్ ఎంపికైనట్లు హెడ్ కోచ్ సునీల్‌కుమార్ తెలిపారు. జీవీఎస్‌సీఎస్ మైదానంలో ఏసీఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాంపులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు తెలియజేశారు. మదనపల్లె జోన్ నుంచి మొదటిసారి రంజీ ప్రాబబుల్స్‌కు దీపన్ సాయినాథ్ ఎంపికవడం పట్ల స్థానిక అసోసియేషన్ పెద్దలు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

వాటర్ గ్రిడ్ పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్

లింగాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వాటర్ గ్రిడ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని.. పనుల్లో వేగం పెంచి డిసెంబరు 15వ తేదీకి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగు నీటి సరఫరా చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. పార్నపల్లె వద్ద రూ.450కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనులను, సీబీఆర్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిలో సాగు, తాగునీటి కొరత రాకుండా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పీబీసీ, లింగాల కుడికాల్వ పరిధి లోని అన్ని చెరువులను నింపాలన్నారు. సీబీఆర్ ప్రాజెక్టు మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. హెచ్‌ఎల్‌సీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ ఆయకట్టు చివరి వరకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలని, రైతులు ఇబ్బందులు పడకూడదన్నారు. ఆర్‌డీఓ చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పీబీసీ ఈఈ వెంకటరామయ్య పాల్గొన్నారు.



సీబీఆర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పట్టాభిరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

వాల్మీకిపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టాభిరామాలయంలో పవిత్రోత్సవాలకు శనివారం టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా అంకురార్పణ చేశారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కలశస్థాపన చేసి స్వామివారి పవిత్రోత్సవాలకు విశేష భక్తజనం నడుమ అంకురార్పణ చేశారు. టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, భాషికాచార్యులు, కృష్ణరాజు, గోకుల్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొత్తచెరువుకు గండి

- జోరుగా ప్రవహిస్తున్న పింఛా నది



పంటపొలాలను ముంచెత్తిన కొత్తచెరువు నీరు

పీలేరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి కొత్తచెరువుకు గండి పడింది. దీంతో వరి, ఆకు కూరలు, కూరగాయల తోటలు నీట మునిగాయి. శనివారం తెల్లవారుజామున మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. వర్షం ధాటికి రెడ్డివారిపల్లె వద్ద కొత్తచెరువుకట్ట తెగి నీరు పొలాలను ముంచెత్తింది. ఇటీవల చెరువు కట్టవద్ద నేషనల్ హైవే అధికారులు ఇష్టానుసారం మట్టి లోడేశారు. దీంతో కట్ట బాగా దెబ్బతినింది. హైవే అధికారులు కట్ట మర్మతు విషయం విస్మరించడంతో రైతుల పాలిట శాపంలా పరిణమించింది. రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పట్టణ సమీపంలో వెళుతున్న పింఛానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నాలేవాండ్లపల్లె వద్ద బ్రిడ్జిపై పింఛా ప్రవాహం వెళ్లడంతో అగ్రహారం, బాలంవారిపల్లె మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పీలేరు తహసీల్దార్ శివకుమార్ రెవెన్యూ అధికారులతో ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. దొడ్డిపల్లె పంచాయతీ పరిధిలో భారీ వర్షం దెబ్బకు గ్రామీణ ప్రాంత రోడ్లు దెబ్బతిన్నాయి. పీలేరు - తలపుల మార్గంలోని దూడరేవులపల్లె వద్ద బడబళ్ల వంకపై బ్రిడ్జి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు ముదస్తుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ మార్గంలో పీలేరు నుంచి గూడరేవులపల్లె, జాండ్ల, తలపుల, మేళ్లచెరువు, యల్లమంద, యార్రవారిపాళ్యం మీదుగా తలకోనకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు, స్థానిక ప్రజలు వెళ్లి వస్తుంటారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షం పడడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



నాలేవాండ్లపల్లె వద్ద బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న పింఛా

శోభాయమానం దుర్గమ్మ నిమజ్జనం

బి.కొత్తకోట, మదనపల్లెల్లో వేడుకగా శోభాయాత్ర



శోభాయాత్రలో దుర్గామాత ప్రతిమ ఎదుట చిన్నారుల భరతనాట్యం - పాల్గొన్న అశేష భక్త వాహిని

బి.కొత్తకోట, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాల్లో భాగంగా బి.కొత్తకోట పట్టణ నడిబొడ్డున ఉన్న జ్యోతి సర్కిల్‌లో మెట్ట మొదటిసారి దుర్గామాత అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. నవరాత్రి అలంకారాలు, రోజువారీ వేడుకలు, అన్నసంతర్పణలు, చెక్కభజనలు, కోలాటాలు, పండరిభజనలు, భరతనాట్యాలు, డీజే నృత్యాలతో పట్టణ ప్రజలను ఉర్రూతలూగించారు. నవరాత్రి ఉత్సవసేన పేరుతో ఏర్పడిన కమిటీ ఈ ఉత్సవ నిర్వహణలో ప్రశంశలు అందుకుంది. ఈ వేడుకకు నిర్వాహకులు కూడా ఊహించని స్పందన రావడంతో పట్టణంలో ఇదే ముఖ్యవేడుకగా ఆవిర్భవించింది. అట్టహాసంగా నవరాత్రి వేడుకలు జరిగాయి. అనంతరం శనివారం దుర్గామాత అమ్మవారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. జ్యోతిసర్కిల్ నుంచి రంగసముద్రం రోడ్డు, బైపాస్, దిగువ బస్‌స్టాండు, చెరువుకట్ట మీదుగా గుమ్మసముద్రం చెరువు వరకు శోభాయాత్ర కొనసాగింది. కేరళ వాయిద్యాలు, మోహినీ అట్టం నృత్యాలు, బళ్లారిడ్రమ్స్, పిల్లనిగ్రోవి బృందం, చక్కభజన, భరతనాట్యాలు ఇలా వివిధ రకాల ఈవెంట్లతో జరిగిన శోభాయాత్ర భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి యాత్రలో వేలల్లో పాల్గొనగా ఆయా వీధుల చివరల్లో హారతులు ఇచ్చిన వారు కోకొల్లలు. బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి పరసింహారెడ్డి, స్థానికులు కుడుం శ్రీనివాసులు, సీఏ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మదనపల్లెలో ఘనంగా ఊరేగింపు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతల జలనిమజ్జనం వేడుకగా చేశారు. చెక్కభజనలు, బళ్లారి డ్రమ్స్, బాణ సంచాపేలుళ్ల నడుమ వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు జరిగింది. పట్టణంలో కమ్మగడ్డవీధిలో నాదేళ్ల అరుణ్ తేజ్ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మను ప్రత్యేక వాహనంలో అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి తరలించారు. సుభాష్ రోడ్డులో సాయికార్తీక్, అభిష్, చైతు, చరిత్, తేజా, గణేష్, రోహిత్ ఆధ్వర్యంలో గత నెల 28న దుర్గమ్మను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి శనివారం రాత్రి ఊరేగింపుగా నిమజ్జనానికి దుర్గమను తరలించి బైపాస్ రోడ్డులోని స్వామి చెరువులో నిమజ్జనం చేశారు. నాగిరెడ్డివీధిలో యువత ఏర్పాటు చేసిన దుర్గమ్మకు పూజలు చేసి తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేసినట్లు నిర్వాహకులు విజేంద్ర తదితరులు పేర్కొన్నారు. ఈశ్వరమ్మ కాలనీ బుగ్గవంక సమీపంలో ఆర్టీసీ రెడ్డెప్ప ఆధ్వర్యంలో దర్గమ్మకు పూజలు నిర్వహించి, ప్రత్యేక వాహనంలో మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి కొత్తవారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. కోటవీధిలో విశ్వబ్రహ్మణ సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ తులసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాతను వివిధ కళాకారులతో, బళ్లారి డ్రమ్స్ వాయిద్యాల నడుమ ఊరేగింపు చేశారు. నీరుట్టువారిపల్లెలో ప్రభుగౌడ్, ప్రమీలరెడ్డి ఆధ్వర్యంలో దుర్గమ్మను ఏర్పాటు చేసి నవరాత్రులు పూజలు నిర్వహించి శనివారం రాత్రి మంగళవాయిద్యాలతో, బాణసంచా పేలుళ్ల నడుమ ఘనంగా ఊరేగించి తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. ప్రశాంతనగర్, మాయాబజారు, కొత్తయిండ్లు, శాస్త్రీవీధి, రామారావుకాలనీ, రెడ్డీస్ కాలనీ, సిరికల్చర్ కాలనీలో దుర్గమ్మకు నిత్య పూజలు అమ్మవారికి అందించి ఘనంగా నిమజ్జనం చేశారు.

గుర్రంకొండలో వేడుకగా....

గుర్రంకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దుర్గాదేవి అమ్మవారి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా హరిజనవాడలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను ట్రాక్టర్‌లో ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



మదనపల్లె కోటవీధి, కమ్మగడ్డవీధిలో ఊరేగుతున్న దుర్గమ్మ - గుర్రంకొండలో ఊరేగుతున్న దుర్గాదేవి అమ్మవారు



రామా.. కనవేమిరా..

- నిండిన కాల్వలు నీటమునిగిన ఆర్టీసీ బస్టాండు ● మంత్రి జిల్లాలోనే ఈదుస్థితి
- చెరువును తలపిస్తున్న వైనం ● మరమ్మతులు చేపట్టాలంటూ డిమాండ్
- ఆందోళనలో వ్యవసాయాధికారులు ● కోడై కూసిన సామాజిక మాధ్యమాలు
- ● నీటిపాలైన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు హామీ



దుకాణాల్లోకి చేరిన నీటిని తోడుకుంటున్న దుకాణదారులు

నీటమునిగిన పీలేరు ఆర్టీసి బస్ స్టాండ్ క్యాంటీన్

పీలేరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్వయంవరంలో శ్రీరాముడు సీతను కన్నెత్తి చూడలేదని రామా కనవేమిరా.. శ్రీరఘురామా కనవేమిరా అంటూ పాడిన వైనం ప్రేక్షకులను కట్టిపడేసింది. అయితే ఇక్కడ రవాణా శాఖ మంత్రి సొంత జిల్లాలోనే ఆర్టీసి బస్ స్టాండ్ దుస్థితిని చూడ రావేమి రామా అంటూ పీలేరు వాసులు, మేధావులు, నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తేనే బస్ స్టాండ్ లోనికి నీరు చేరాయి. వివరాల్లోకెళితే....

శనివారం వేకువ నుంచే వర్షం కురుస్తోంది. సుమారు మూడున్నర గంటల పాటు కురిసిన భారీ వర్షానికి (ఉదయం 5 గంటల నుంచి 8.30) 84.2 మి.మీల వర్షం కురిసింది. ఈపాటికే ఆర్టీసీ బస్‌స్టాండు చెరువును తలపిస్తోంది. సాక్షాత్తు రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి సొంత జిల్లా, అంతేకాదు ఆయన నియోజకవర్గానికి పక్క నియోజకవర్గ కేంద్రంలోని బస్ స్టాండు అధ్వాన్న స్థితిపై పలువురు మండిపడుతున్నారు. పాలకులు, అధికారులు మారినా బస్ స్టాండులో మరమ్మతులు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉదయాన్నే విద్యా, ఉపాధి, వ్యాపారాల కోసం బయలుదేరిన ప్రయాణీకులు, ఉద్యోగులు, విద్యార్థులకు బస్ స్టాండులో బస్సులు ఎక్కడం కష్టతరమైంది. బస్ స్టాండు లోనైనా కాసేపు కూర్చుందామా అంటే ప్రయాణీకులు వేచి ఉండే ప్రదేశం మోకాల్లోతు నీళ్లతో మునిగింది. ప్రభుత్వాలు మారినా పీలేరు బస్‌స్టాండు మారదా అనే ప్రశ్న తలెత్తింది.

నిత్యం చెరువులా మారుతున్న వైనం

చినుకు పడితే పీలేరు ఆర్టీసీ బస్ స్టాండు చెరువును తలపిస్తోంది. బస్ స్టాండు ప్రాంగణంలో నిర్మించిన మురుగునీటి కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలమవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా బస్ స్టాండు ప్రాంగణంలో నిలిచిపోతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. దశాబ్ద కాలంగా వర్షం కురిసిన ప్రతీసారీ ఇదే పరిస్థితి నెలకొంటున్నా ఎవరికీ ఈ సమస్య కన్పించనట్టుంది. దీంతో ప్రతిసారీ అటు బస్‌స్టాండు ప్రాంగణంలోని దుకాణదారులు, ఇటు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీలేరులో కురిసిన వర్షం ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం. వర్షం దెబ్బకు ఆర్టీసీ బస్ స్టాండు ప్రాంగణం ఒక్కసారిగా చెరువులా మారిపోయింది. అటు వర్షపు నీరు చేరిక, ఇటు ఆర్టీసీ నల్లగుట్ట, వారపు సంత ప్రాంతాల్లోని మురుగునీటి కాల్వలు నిండిపోవడంతో ఆ నీరంతా బస్టాండులోకి చేరింది. బస్టాండులోని మురుగునీటి కాల్వలు పూర్తిగా పూడిపోవడమే కారణంగా నీరంతా ఇక్కడే నిలిచిందని చెప్పవచ్చు. ప్రయాణీకుల ఇబ్బందులు ఇలా ఉండగా ఆర్టీసీ ప్రాంగణంలోని దుకాణాల్లోకి నీరు చేరడంతో దుకాణాలను మూసివేశారు. క్యాంటీన్‌లో సైతం నీరు నిలిచిపోవడంతో అల్పాహారానికి సైతం ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. బస్‌స్టాండు నుంచి బయటకు వచ్చే దారి కూడా పూర్తిగా నీటితో నిండిపోవడంతో కూర్చునే అవకాశం లేక, బయటకు రాలేని పరిస్థితి లేక ప్రయాణీకులు అసౌకర్యానికి గురయ్యారు. బస్ స్టాండు ప్రాంగణంలో వాహనాలు వారు ఇబ్బందులు పడ్డారు. మోకాళ్లలోతు వర్షనీరు చేరడంతో ద్విచక్ర వాహనాల టైర్లు మునిగిపోవడంతో వాటిని బయటకు తీసేందుకు నానా కష్టాలు పడ్డారు. కార్లు, ఆటోల యజమానులు సైతం తమ వాహనాల్లోకి ఎక్కడ నీరు చేరతాయోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. కేవలం బస్ స్టాండు ప్రాంగణంలోనే కాకుండా ఎల్‌బీఎస్ రోడ్డులోని ఎస్వీ మహల్ థియేటర్ ప్రాంతంలో కూడా మురుగునీటి వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే ప్రవహించింది. తద్వారా అక్కడ కూడా వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. చివరకు డీఎం రోషన్, స్థానిక అగ్నిమాపక సిబ్బంది సాయంతో బస్టాండులో నిలిచిపోయిన నీటిని తొలగించాల్సి వచ్చింది. వారపు సంతకు వెళ్లే మార్గంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలోకి ఎక్కడ వర్షపు నీరు ప్రవేశిస్తుందోనన్న వ్యవసాయ అధికారులు ఆందోళన పడ్డారు. ఆ ప్రాంతంలోని మురుగునీటి కాల్వలను గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది వర్షంలోనే హుటా హుటిన శుభ్రం చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రి పట్టించుకోవాలి

శనివారం ఉదయం నుంచి పీలేరు బస్‌స్టాండు దుస్థితిని పలువురు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసుకోవడంతో జిల్లాలోనే ఉన్న రవాణా మంత్రి పీలేరు బస్‌స్టాండును పట్టించుకోవాలనే డిమాండ్లు చెలరేగాయి. గతంలో సాక్షాత్తు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు బస్ స్టాండు ప్రాంగణంలో మరమ్మతులు చేస్తామని ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదని, జిల్లాకే చెందిన మంత్రి పట్టించుకోవాలని పలువురు నెటిజన్లు పేర్కొన్నారు.



నీట మునిగిన ఆర్టీసీ బస్టాండు కమర్షియల్ కాంప్లెక్స్ దారి

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపట్టిన తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి

వంగదనపల్లె అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రామాచార్లపల్లె పంచాయతీ, నిమ్మనపల్లె రోడ్డు, వశిష్ట స్కూల్ సమీప కాలనీ ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి తొలగించారు. కాలనీ సమీపంలో 20 కుంటల ప్రభుత్వ స్థలం ఉందని దీన్ని బడి, గుడి, వైద్యశాలకు కేటాయించాలని, పరులకు సొంతం చేయకూడదని తహసీల్దార్‌కు విన్నవించారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకే ఇక్కడ పశువుల పాకలు వేశామన్నారు. ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. కాలనీవాసులు రెడ్డెప్ప నాయక్, శాంతమ్మ, బాలాజీ, రాణమ్మ, మీనా, భావన, ముంతాజ్, శ్యామల, మధు, చందు, హరీష్, లక్ష్మీదేవి, లావణ్య, శృతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

సైన్స్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సైన్స్ ల్యాబ్‌లో పరికరాలను విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం జడ్పీహైస్కూల్‌లో పోర్డు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.8లక్షల విలువైన సైన్స్‌ల్యాబ్ పరికరాలను, ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ అమెరికాకు చెందిన సీఆర్‌వై సంస్థ సహకారంతో రూ.8లక్షల విలువ చేసే ల్యాబ్ పరికరాలు కొనుగోలు చేసి జడ్పీ హైస్కూల్లో ఒక ప్రత్యేక గదిలో ఏర్పాటు చేశామన్నారు. డీవైఈఓ లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ మాథ్స్ సబ్జెక్టులు చదువుతూ నిజ జీవితంలో వాటి ఉపయోగాల గురించి ఈ ల్యాబ్‌లో వున్న ప్రయోగాత్మక పరికరాలతో తెలుసుకోవచ్చన్నారు. ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, సైన్స్ అధ్యాపకులు, పోర్డు సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరు వర్షంలోనూ 'ఆటో డ్రైవర్ల సేవలో'

- అట్టహాసంగా ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ● తంబళ్లపల్లెలో వంద ఆటోలతో భారీ ర్యాలీ
- ● ఆర్వోబీ పనులపై ఎమ్మెల్యే అసహనం





పీలేరు సభలో మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి - తంబళ్లపల్లెలో ఆటోల ర్యాలీలో పాల్గొన్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు

పీలేరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ వైపున కుండపోత వర్షం కురుస్తున్నా ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని శనివారం పీలేరులో అట్టహాసంగా ప్రారంభించారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పీలేరుకు తరలి వచ్చిన ఆటో కార్మికుల సమక్షంలో నియోజకవర్గం మెగా చెక్కును ఆటో డ్రైవర్లకు అందజేసిన ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల కష్టాలను స్వయంగా చూసిన చంద్రబాబు, నారా లోకేశ్ అధికారంలోకి వచ్చిన తరువాత వారికి ఆర్థిక సాయం చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి సాయం అందిస్తున్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 వేలు అందించగా కూటమి ప్రభుత్వం రూ.15 వేలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆర్థిక సాయంతో వాహన నిర్వహణ, రికార్డుల అప్‌డేట్ చేసుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లోని 1747 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.2.62 కోట్లు మంజూరు చేసిందన్నారు. అర్హులై ఉండి పథకం వర్తించని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆర్వోబీ పనులపై ఎమ్మెల్యే అసహనం

పీలేరులో నత్తనడకన సాగుతున్న ఆర్వోబీల నిర్మాణంపై శనివారం జరిగిన 'ఆటో డ్రైవర్ల సేవలో' ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో సరిగ్గా జరగని భూసేకరణ, పరిహారం పంపిణీ, సరైన కాంట్రాక్టర్ల ఎంపిక కారణాలతో చిత్తూరు, మదనపల్లె మార్గాల్లోని ఆర్వోబీల పనులు చాలా ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు. పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్లను పలుమార్లు హెచ్చరించినా పెడచెవిన పెడుతున్నారని, ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తున్నారన్న కారణంతో వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించామన్నారు. ఇకనైనా కాంట్రాక్టర్లు తీరు మారకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, పీలేరు ఎంపీపీ విజయలక్ష్మి, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పార్టీ మండలాధ్యక్షులు, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

వంద ఆటోలతో భారీ ర్యాలీ

తంబళ్లపల్లె, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలబడిందని తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు దినేష్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, పరిశీలకులు సోముశేఖర్, రెడ్డప్ప, అధికారులతో కలిసి నియోజకవర్గంలో 870 మంది డ్రైవర్లకు రూ.1.35కోట్ల చెక్కును పంపిణీ చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తంబళ్లపల్లె సమీప హైస్కూలు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు సుమారు 100 ఆటోలతో భారీ ర్యాలీ చేపట్టారు. ఆర్డీఓ శివలింగప్ప, ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి, పరిశీలకులు సోము శేఖర్, రెడ్డప్ప, మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, ఉత్తమ్‌రెడ్డి, సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, తెలుగు యువత నరసింహులు, మ్యూజికల్ శివ, వీరాంజనేయులు, కాలా నారాయణ, మదన, గ్రామాధ్యక్షులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో 106 మందికి....

నిమ్మనపల్లి అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మండలంలోని 106మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15వేలు వ్యక్తి గత ఖాతాకు జమచేసినట్లు డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం ప్రవేశపెట్టి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రవేశ పెట్టడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై ప్రభావం పడిందన్నారు. దీంతో రాష్ట్రంలోని ఆటో మ్యాక్సీ క్యాబ్, మోటార్ కలిగిన డ్రైవర్లపై ప్రభావం పడకుండా ఏడాదికి ఒక డ్రైవర్‌కు రూ.15వేలను అదించినట్లు తెలిపారు. బస్‌స్టాండులో ఆటో డ్రైవర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచాపేల్చి సంబారాలు చేసుకున్నారు.



దరఖాస్తులు ఆహ్వానం

తంబళ్లపల్లె, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందడానికి ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ టీఓ నాగరాజు పేర్కొన్నారు. ఈ శిక్షణ మూడు నెలలు ఉంటుందన్నారు. 15 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 15వ తేదీ లోపు సెంటర్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ చౌడయ్య 9618655759ను సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

భాషా పండితుల పాలాభిషేకం

పీలేరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించినందుకు భాషా పండిత ఉపాధ్యాయులు శనివారం మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కూడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌టీపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తరిగొండ రెడ్డి రమేశ్ మాట్లాడుతూ భాషా పండిత ఉపాధ్యాయులు ఆరేళ్లగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తూ, బదిలీల సమయంలో క్యాడర్ సమస్యలుండేవన్నారు. నారా లోకేశ్ చొరవతో పదోన్నతులు దక్కాయన్నారు. రాష్ట్ర కార్యదర్శులు సురేశ్ కుమార్, రమేశ్, ఎస్‌టీపీ నేతలు అమరనాథ్, మస్తాన్, శ్రీనివాసులు, హరి, భాషా పండితులు కిరణ్ కుమార్, దేవేంద్ర, మధు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

చాపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మొరాయిపల్లె వంక బ్రిడ్జి వద్ద శనివారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందన్నారు. ఎరుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. అతని ఆచూకీ తెలిసినవారు 9121100601 అనే నంబరుకు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు సర్వీసులు నడపాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి చదువుకు నేందుకు వచ్చే విద్యార్థులకు అనుకూలంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని టూ డిపో మేనేజరు కు బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ వినతిపత్రం అందించారు. విద్యాసంస్థలకు దూరప్రాంతాల నుంచి రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సర్వీసులు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో పాఠశాలలకు వచ్చేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్న ట్లు చెప్పారు.



వేంకటేశ్వర కల్యాణోత్సవం



వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

కలికిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీ చక్కిరవాండ్లపల్లెలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామికి ఇరువైపులా శ్రీదేవి, భూదేవి వేదికపై కొలువుదీరగా మంత్రోచ్ఛారణల మధ్య వేంకటేశ్వరస్వామి మాంగళ్య ధారణ చేశారు. రాత్రి వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, అక్టో బరు 4(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

7న సామూహిక వ్రతాలు

కలికిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంకాలం 7 గంటలకు ఈ వ్రతం నిర్వహిస్తామన్నారు. ఆదివారం నుంచి రోజు సాయంకాలం 4 నుంచి 6 గంటల వరకూ ఆలయంలో సత్సంగ కార్యక్రమాలుంటాయని తెలిపారు. 22వ తేదీ నుంచి కార్తీక మాస నోములు, కేదారేశ్వర వ్రతాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

రేపు మండల సమావేశం

నిమ్మనపల్లి అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి సాధారణ మండల సమావేశం సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. మూడు నెలలకు ఒక సారి నిర్వహించే సాధారణ సమావేశం ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో జరుగుతుందని మండల స్థాయి అధికారులు వారి శాఖపై పూర్తి వివరాలతో హాజరవాలని తెలిపారు.

ఆంజన్నకు ప్రత్యేక పూజలు



కలకడ అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజన్నను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకు పూజ చేశారు.